# అంగన్‌వాడీతో చదువుకు బాట

- కేంద్రాల్లో పెరుగుతున్న చిన్నారులు
- ఆటపాటలతో విద్యకు సన్నద్ధం



చిగురుమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాలు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్

చిగురుమామిడి, డిసెంబర్ 1: ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు చేపట్టిన అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నది. ఇందులో భాగంగా ఇంటింటా తిరిగి కేంద్రాల్లో అందిస్తున్న సేవలు వివరించడంతో గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలపై క్రమంగా ఆసక్తి పెరిగింది. ఆటపాటలతో విద్యనందిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాల్లో చేర్పిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను టీచర్లు ఆటపాటలతో అలరిస్తూ వారికి అమ్మ ఒడిలో ఉన్న భావన కల్పిస్తున్నారు. ఉచిత విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఉదయం 9 గంటలకు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుంటుండగా, వారికి టీచర్లు స్వాగతం పలుకుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పరిశీలిస్తారు. వరుస క్రమంలో గదిబయట చెప్పులు పెట్టించడం ద్వారా క్రమశిక్షణ నేర్పుతున్నారు. అరగంట పాటు కేంద్రం ఆవరణలో ఆటలు ఆడిస్తారు. వ్యాయామం చేయిస్తున్నారు. ఉదయం 10 గంటలకు గుడ్డు అందిస్తారు. మాట్లాడే విధానాన్ని నేర్పిస్తూ భాషపై అవగాహన కల్పిస్తున్నారు.

### స్థాయిని బట్టి బోధన

రెండున్నర నుంచి మూడేళ్ల వయస్సు వారిని నర్సరీ, మూడు, నాలుగు ఏళ్ల వయసున్న వారిని యూకేజీగా విభజిస్తారు. స్థాయిని బట్టి అక్షరాలు, అంకెలు బోధిస్తారు. నాలుగు సంవత్సరాలు పైబడిన వారికి సృజనాత్మక కృత్యాలను చూపిస్తూ నేర్పిస్తారు. చిన్నారులను ఆలోచింపజేసే చిట్టి కథలు చెప్తారు. వాటి సారాంశాన్ని వారితోనే చెప్పించే ప్రయత్నం చేస్తారు. మధ్యాహ్నం భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకునే విధానం, ఎవరికి వారే అన్నం తినేలా దగ్గర ఉండి నేర్పిస్తారు. చిన్నారులను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండున్నర గంటల వరకు నిద్రపుచ్చుతారు. తర్వాత పునశ్చరణ తరగతులతోపాటు ఉపాధ్యాయులు వారితో ఆడుతూ ఆడిస్తారు.

### 2053 మంది చిన్నారులకు ప్రయోజనం

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 39 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జీరో నుంచి ఏడు సంవత్సరాలు గలవారు మొత్తం 2053 మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతోపాటు విద్యకు సన్నద్ధం చేస్తారు. సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మండలంలోని 215 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేసి ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్నారు.

### పిల్లల సంఖ్య పెరుగుతున్నది



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకర్షణీయంగా అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నది. చిన్నారులకు అక్షరమాలను బోధించడంతో పాటు బొమ్మలు వేయడంలో శిక్షణ ఇస్తున్నాం. ఆటపాటలతో వారిని తీర్చిదిద్దుతున్నాం. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

*-ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ (చిగురుమామిడి)*

# జాతీయస్థాయి పోటీలకు పారమిత విద్యార్థిని ఎంపిక

తిమ్మాపూర్, డిసెంబర్ 1: మండలంలోని అల్గునూర్ గ్రామంలోని పారమిత వరల్డ్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్న నిజాం అస్మిత అండర్-19 బాలికల విభాగంలో ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించి, ఈ నెల 7నుంచి మూడు రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలోని నందియాడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీకర్, కోఆర్డినేటర్ నాగరాజు, పీఈటీలు తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు తదితరులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం



ముంజంపల్లిలో నారుమడి

# యాసంగి సాగుకు రైతన్న సమాయత్తం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 1: మండలంలోని చెంజర్ల, గంగిపల్లి, కొండపల్కల, గట్టుదుద్దెనపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో యాసంగి వరి కోసం అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు. పల్లెల్లో దుక్కి దున్ని, నారుమడుల్లో సైతం నారు పోసుకున్నారు. నారును పెంచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సారి వరి సాగులో వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో నారు వేసేందుకు ముందస్తు ప్రణాళికలతో సమాయత్తం అవుతున్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

శంకరపట్నం, డిసెంబర్ 1: మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. మహమ్మారిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేణుగోపాల్, ఫార్మాసిస్ట్ మతిన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





పర్లపల్లిలో మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటేయడానికి బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

# ‘ఓటు’కు పోటెత్తారు..

- మానకొండూర్ నియోజకవర్గంలో 83.21శాతం పోలింగ్ నమోదు

తిమ్మాపూర్, డిసెంబర్ 1: మానకొండూర్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు పోటెత్తారు. గురువారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే బారులు తీరారు. గత ఎన్నికల మాదిరే ఈ ఎన్నికల్లో సైతం పెద్ద సంఖ్యలో ఓటు వేసి 83.21శాతంతో రికార్డు సృష్టించారు.

### మండలాల్లో ఇలా..

మానకొండూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,18,413మంది ఉండగా.. ఇందులో 1,07,371 మంది పురుషులు, 1,11,041 మంది మహిళలు. గురువారం జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో 1,80,236మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మానకొండూర్ మండలంలో 47,185మంది ఓటు వేయగా 83.17శాతం పోలింగ్ నమోదైంది. అలాగే శంకరపట్నం మండలంలో 30,343మంది ఓటు వేయగా 81.53శాతం పోలింగ్ నమోదైంది. తిమ్మాపూర్ మండలంలో 34,436మంది ఓటు వేయగా 81.24శాతం పోలింగ్ నమోదైంది. గన్నేరువరం మండలంలో 15,442మంది ఓటు వేయగా 86.17శాతం పోలింగ్ నమోదైంది. బెజ్జంకి మండలంలో 21,895మంది ఓటు వేయగా 78.21శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఇల్లంతకుంట మండలంలో 30,935మంది ఓటు వేయగా 78.60శాతం పోలింగ్ నమోదైంది.

### పోలింగ్ శాతం పెంపునకు చర్యలు

పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు బూత్‌ల్లో మహిళా, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మోడల్ పోలింగ్ బూత్‌లను తీర్చిదిద్దారు. ఓటర్లు కూర్చునేందుకు అలంకరించిన కుర్చీలను సైతం ఏర్పాటు చేశారు. బూత్‌లను సుందరీకరించి ఓట్ల శాతం పెరిగేలా అధికారులు కృషి చేశారు. గ్రామాల్లో బూత్‌లకు ఓటర్లను తీసుకెళ్లేందుకు ఆటోలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వీల్‌చైర్‌ను ఏర్పాటు చేసి బూత్‌లోకి తీసుకెళ్లి ఓటు వేయించారు.

### అభివృద్ధికే ఓటు..!

నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదవగా.. నూతన ఓటరు నుంచి శతాధిక వృద్ధుల వరకు ఎవరూ ఓటు హక్కును వదులుకోలేదు. మెజార్టీ ఓట్లు అభివృద్ధికే వేసినట్లు తెలుస్తున్నది. మూడు పార్టీల మధ్య పోటీ ఉండగా.. చివరికి రెండు పార్టీల మధ్య పోటీ తారాస్థాయికి చేరింది. అత్యధికంగా ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు గ్రామాల్లో చర్చ జరుగుతున్నది.

# ఓటింగ్‌కు దూరంగా విద్యావంతులు!



శంకరపట్నం: కన్నాపూర్ గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

శంకరపట్నం, డిసెంబర్1: ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరుగుతుండడం శుభ పరిణామమే అయినా మరోవైపు విద్యావంతులు ఓటింగ్ ప్రక్రియకు దూరంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. 2018తో (85.36) పోలిస్తే ఈ సారి 2 శాతం పోలింగ్ తగ్గగా అది విద్యావంతుల ఓట్లుగానే తెలుస్తోంది. నియోజకవర్గవ్యాప్తంగా 83.21 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యంపై తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. శంకరపట్నం పోలింగ్‌లో 81.53 శాతం ఓట్లతో 3వ స్థానంలో నిలిచింది. మండలంలో 37,216 ఓటర్లు ఉండగా, 30,343 ఓట్లు పోలైనవి. మండలంలో పలువురు యువకులు నోటాకు ఓటు వేసినట్లు సర్వేలో తేలింది. ఇది తమ ఆలోచనను తెలుపుటకు సరైన నిర్ణయమే అవుతుంది. అయితే ఉన్నత విద్య చదివిన పలువురు విద్యాధికులు మాత్రం తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని ముందుండి నడిపించాల్సిన విద్యాధికులు తమ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం భవిష్యత్‌కు ఆందోళన కలిగించే విషయంగానే భావించాలి.